

19వ వసంతంలోకి ...

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

బుధవారం 21 జనవరి 2026

పేజీలు 8


ఉగాది నుంచి

# 50% గ్రీన్ కవర్ ప్రాజెక్టు అమలు



- ఉగాదిలోపు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయండి
- గ్రీన్ కవర్ ప్రాజెక్టులో అన్ని శాఖలూ త్రికరణ శుద్ధిగా భాగస్వాములు కావాలి
- గ్రీన్ కవర్, గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టుల్లో స్వజాతి మొక్కలకు ప్రాధాన్యం
- పరిశ్రమల శాఖ కాలుష్యాన్ని నియంత్రించే మొక్కలు నాటాలి
- వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- ఆయా శాఖల భాగస్వామ్యంపై దిశానిర్దేశం

**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** రాష్ట్రాన్ని 50 శాతం పచ్చదనంతో నింపే గ్రీన్ కవర్ ప్రాజెక్టులో అన్ని శాఖలు త్రికరణ శుద్ధిగా భాగస్వామ్యం తీసుకోవాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ సూచించారు. నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా అన్ని శాఖలు ఉగాదిలోపు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. ఉగాది నుంచి గ్రీన్ కవర్ యాక్షన్ ప్లాన్ అమలు కావాలని ఆదేశించారు. పరిశ్రమల శాఖ – కాలుష్యాన్ని నియంత్రించే మొక్కలు నాటేందుకు, తీర ప్రాంతాల్లో పెనుగాలులు, ఉప్పు నీటిని తట్టుకునే మొక్కల పెంపకానికి సిద్ధం కావాలని నిర్దేశం చేశారు. గ్రీన్ కవర్, గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టుల్లో స్వజాతి వృక్ష

2లో



## రోడ్డు ప్రమాదాల నివారణ ఇలా..

జిల్లాలో నిబంధనలు పాటించక జరిగిన 3వేల పైగా ప్రమాదాలు...

జిల్లాలో ఈ నెల 16 నుంచి వచ్చే నెల 15 వరకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు

గుడ్లవల్లేరు జనవరి 20 మేజర్ న్యూస్ : ప్రయాణాల్లో నిబంధనలు పాటించటం లేదన్న ఆరోపణలు రవాణా శాఖ అధికారుల నుంచి వస్తున్నట్లే రవాణాలో తమకు రక్షణ ఉండటం లేదని ప్రయాణికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కృష్ణాజిల్లాలో 2022నుంచి ఈనాటికి 3వేలకు పైగా ప్రమాదాలు ట్రాఫిక్ నిబంధనలు పాటించక చోటు చేసుకున్నాయంటే ఏ మాత్రం అతిశయోక్తి కాదు. బైకిస్టులు, వాహన చోదకులు అప్రమత్తంగా లేకపోవటం 2

బాల్య వివాహాలు నిరోధించేందుకు... 2

## బాధ్యత తీసుకోవాలి



## ఓఎన్‌జీసీ సిఎస్ఆర్ నిధులతో..

### గ్రామాలలో మౌలిక సదుపాయాలు

కృష్ణాజిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ



**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్/కృత్తివెన్ను, మేజర్ న్యూస్ :** కార్పొరేట్ సామాజిక బాధ్యత(సిఎస్ఆర్) కింద ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్ కార్పొరేషన్(ఓఎన్‌జీసీ) అందించే నిధులతో గ్రామాలలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కృత్తివెన్నులోని మండల తహసీల్దారు కార్యాలయంలో 2లో..

# సైబర్ మోసాల పట్ల జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండండి

## పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు




**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్ట్ మొదలైన నేరాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆధ్వర్యంలో సైబర్ సిటిజన్, సైబర్ కమాండో, సైబర్ సురక్ష మొదలైన వినూత్న పద్ధతులలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమాల వలన ప్రజలలో చైతన్యం వచ్చి కొంతమంది వచ్చిన ఫోన్ కాల్స్ పై అనుమానం రాగానే పోలీసు వారిని సంప్రధించి సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్త పడటం జరిగింది.

**ఉదాహరణకు ఈ మధ్య కాలంలో జరిగిన కొన్ని సంఘటనలు**

-ది.06-11-2025 వ తేదిన భవానిపురం ఏరియాలోని ఒక సీనియర్ సిటిజెన్ కు వాట్సప్ కాల్స్ చేసి మీమీద మనీ లాండరింగ్ కేసు ఉంది అంటూ స్టేట్ మెంట్ రికార్డు చేసి తప్పించాలంటే డబ్బులు డిపాజిట్ చేయమని బెదిరించగా వెంటనే సైబర్ పోలీసు వారిని సంప్రదించి సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్త పడటం జరిగింది.

-ది.08-11-2025 వ తేదిన కృష్ణ లంక పోలీసు స్టేషన్ పరిధిలో ఒక సీనియర్ సిటిజెన్ కు వాట్సప్ కాల్స్ చేసి బెంగుళూరు పోలీసు అని చెప్పి మీ ఫోన్ ద్వారా అశ్లీల ఫోటోలు పంపినట్లు కేసు నమోదైంది దానిని నుండి మీ పేరు తొలగించాలంటే డబ్బులు డిపాజిట్ చేయమని బెదిరించగా వెంటనే సైబర్ పోలీసు వారిని సంప్రదించి సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్త పడటం జరిగింది.

-మోసగాళ్లు పోలీస్ / కోర్టు / కస్టమ్స్ / టెలికాం అధికారులమని చెప్పుకొని వాట్సప్ కాల్స్ చేస్తారు. నకిలీ ఎఫ్ఐఆర్ లు చూపించి "డిజిటల్ అరెస్ట్" అంటూ భయపెడతారు. మీ ఆదార్, సిమ్ కార్డు పేరుతో మనీ లాండరింగ్, డ్రగ్స్, హ్యూమన్ ట్రాఫికింగ్ కేసులని చెబుతారు. అరెస్ట్ తప్పించాలంటే వెంటనే డబ్బులు ట్రాన్స్ఫర్ చేయమని ఒత్తిడి చేస్తారు.

-పోలీసులు ఎప్పటికీ ఫోన్ లేదా వాట్సప్ ద్వారా డబ్బులు అడగరు, ఎలాంటి లింక్‌లను ఓపెన్ చేయవద్దు డబ్బులు పంపవద్దు. అనుమానాస్పద కాల్ వస్తే వెంటనే కట్ చేయండి. సమీప సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించండి లేదా 1930 కు కాల్ చేయండి.

# అగ్నిమాపక నివారణ చర్యలపై అవగాహన








**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ ఆర్ ఎఫ్ ఓ మాల్యాద్రి మంగళవారం ఉదయం బబురి గ్రౌండ్స్ లో జరుగుతున్న విజయవాడ ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్, సితార జంక్షన్ విద్యార్థర పురం లో జరుగుతున్న వైష్ణవి ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్ను క్షేత్రస్థాయిలో సిబందితో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఓ మాల్యాద్రి మాట్లాడుతూ బబ్బురి గ్రౌండ్స్ లో జరుగుతున్న విజయవాడ ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్లో అగ్నిమాపక నివారణ చర్యలు ఉన్నాయా లేవా అని క్షేత్రస్థాయిలో పరిశీలించారని, ఎగ్జిబిషన్లో స్టాల్స్ పెట్టిన వారు, స్టాల్స్ లో వంట చేసే సామాగ్రి కానీ, అగ్ని ప్రమాదాలకు కారణం అయ్యే ఎటువంటి పరికరాలు ఉంచరాదనీ, అవి పెట్టడం వలన అగ్ని ప్రమాదం జరిగితే, స్టాల్స్ అన్నిటికీ అగ్ని ప్రమాదం జరిగే అవకాశం ఉందని వారికి అవగాహన కలిపించారని అన్నారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్న ప్పటికీ స్టాల్స్‌లో అగ్ని ప్రమాదానికి గురయ్యే పరికరాలు కనిపించినచో వెంటనే ఎగ్జిబిషన్ నే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రజల క్షేమం కోసం విఎంసి ఫైర్ సిబ్బంది ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి, నిర్వాహకులు అగ్ని ప్రమాద నిరోధక చర్యలు ఖచ్చితంగా పాటిస్తున్నారా లేదా అని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, ప్రజలకు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమం లో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

**జగ్గయ్యపేట జనవరి 20 మేజర్ న్యూస్ :** నియోజకవర్గ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సేవలందిస్తున్న జగ్గయ్యపేట శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మరోసారి తమ సేవా మనసును చాటుకున్నారు. నియోజకవర్గానికి మొత్తంగా రూ.56,40,003/- ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరవగా, ఇందులో భాగంగా జగ్గయ్యపేట పట్టణానికి చెందిన 16 మంది లబ్ధిదారులకు రూ.4,41,980/- విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే తమ నివాసంలో స్వయంగా అందజేశారు. పట్టణానికి చెందిన పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన 16 మంది బాధితులు వివిధ తీవ్రమైన అనారోగ్య సమస్యల కారణంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు చేయించుకోవడంతో భారీ వైద్య ఖర్చులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) దృష్టికి తీసుకురాగా, ఆయన మానవీయంగా స్పందించి తక్షణమే చర్యలు చేపట్టారు. బాధితుల వైద్య బిల్లులు, ఆసుపత్రి ధ్రువీకరణ పత్రాలను సమగ్రంగా పరిశీలించి ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపించడంతో పాటు, లబ్ధిదారులకు ఆర్థిక సహాయం త్వరితగతిన అందేలా అధికార యంత్రాంగంతో సమన్వయం చేస్తూ నిరంతరం ఫాలోఅప్ చేశారు. ఫలితంగా సీఎం రిలీఫ్ ఫండ్ నుండి రూ.4,41,980/- విలువైన చెక్కులు మంజూరయ్యాయి. మిగిలిన వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ, జగ్గయ్యపేట మండలాలకు సంబంధించిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం, రేపు లబ్ధిదారుల గృహాలకు వెళ్లి స్వయంగా అందజేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పేద, బలహీన వర్గాల ప్రజలకు అత్యవసర సమయంలో వరంగా మారిందని, ముఖ్యంగా ప్రాణాపాయ పరిస్థితుల్లో వైద్య చికిత్సకు ఈ నిధి ఎంతో కీలకమని తెలిపారు. ఎల్ఓసి విధానం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సహాయం అందేలా




కూటమి ప్రభుత్వం సరళమైన విధానాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సంక్షేమం, అభివృద్ధి దిశగా అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతోందని తెలిపారు. పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం రిలీఫ్ ఫండ్ రైతులకు వ్యవసాయ మద్దతు మహిళల ఆర్థిక స్వావలంబనకు సంక్షేమ పథకాలు,యువతకు ఉపాధి అవకాశాలు, వృద్ధులు, వికలాంగులు, దివ్యాంగులకు పెన్షన్ల పెంపు,విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు వంటి మౌలిక వసతుల అభివృద్ధి ఇవన్నీ కూటమి ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యతలుగా కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజా ప్రతినిధిగా ప్రతి ఇంటి సమస్యను తన సమస్యగా భావించి పనిచేస్తున్నానని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ మల్లెల సీతమ్మ,కొండయ్య, కౌన్సిలర్లు కంచేటి గీతారాణి, సంగెపు బుజ్జిబాబు, కాచవరం కెనాల్ చైర్మన్ కానూరి కిషోర్, నాయకులు గింజుపల్లి కృష్ణ, కంభంపాటి పుల్లారావు, అన్నెపాక దుర్గామహేశ్వరరావు, బొబ్బిళ్లపాటి ప్రసాద్, గంగవరపు వెంకటేశ్వరరావు, రెడ్డి బోయిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## మంగొల్లులో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

**వత్సవాయి జనవరి 20 మేజర్ న్యూస్:** మండలంలోని, మంగొల్లు గ్రామంలో అన్నెపాక వెంకటేశ్వర్లు, ఏలూరి అనీల్ ఇద్దరూ ఇటీవలే అనారోగ్యానికి గురై ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొంది అనంతరం హాస్పటల్ నుండి డిశ్చార్జ్ అయిన తర్వాత ఆ బిల్లులను శాసనసభ్యులు శ్రీ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) సిఫార్సు ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధికి అప్లై చేయగా మంగళవారం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను శాసనసభ్యులు మంగొల్లు గ్రామంలో వారి గృహానికి వెళ్లి బాధితులకు స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసి కెనాల్ వైస్ చైర్మన్ మన్నె నారాయణరావు, మంగొల్లు గ్రామ సొసైటీ చైర్మన్ బొల్లం పురుషోత్తం, అన్నెపాక దుర్గ మహేశ్వరరావు, శీలం నాగయ్య, నంద్రు ప్రసాద్, శేఖర్ బాబు, మన్నే నారాయణ (మిల్క్) తదితరులు పాల్గొన్నారు.

## నేడు వీరవల్లిలో ఉచిత మెడికల్ వైద్య శిబిరం

**నారాయణపురం, శాలివాహన కాలనీ, హరిచంద్ర తాండా ప్రజలకు ఆరోగ్య సేవలు**

**హనుమాన్ జంక్షన్, జనవరి 20, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలో నేడు ఉచిత మెడికల్ వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ శిబిరం జనవరి 21 (బుధవారం) నాడు వీరవల్లి గ్రామ సర్పంచ్ పిల్లా అనిత ఆధ్వర్యంలో నారాయణపురం, శాలివాహన కాలనీ, హరిచంద్ర తాండా ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని వీరవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. శిబిరంలో గ్రామ ప్రజలకు నిపుణులైన వైద్యులు ఫిజికల్ ఎగ్జామినేషన్ నిర్వహించి, బీపీ, షుగర్, హెచ్‌బి, బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ), పల్స్ రేటు, ఆక్సిజన్ సాట్యూరేషన్, శరీర ఉష్ణోగ్రత, యూరిన్ రొటీన్ ఎగ్జామినేషన్ వంటి ముఖ్యమైన ఆరోగ్య పరీక్షలను పూర్తిగా ఉచితంగా నిర్వహించనున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆరోగ్య పరిరక్షణ ఎంతో ముఖ్యమని, ముందస్తు వైద్య పరీక్షల ద్వారా అనేక వ్యాధులను గుర్తించి నివారించవచ్చని ఈ సందర్భంగా వైద్యులు తెలిపారు. ముఖ్యంగా పేదలు, వృద్ధులు, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ఉచిత మెడికల్ క్యాంపును నారాయణపురం, శాలివాహన కాలనీ, హరిచంద్ర తాండా ప్రాంత ప్రజలందరూ వినియోగించుకోవాలని గ్రామ సర్పంచ్ పిల్లా అనితతో పాటు, వీరవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్మయి విజ్ఞప్తి చేశారు.

## ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకుందాం



**ఏ.కొండూరు, మేజర్ న్యూస్ :** సిపిఎం ఈనెల 18 నుంచి 23 తేదీ వరకు ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకుందాం అని ఇంటింటికి ఉపాధి ప్రచారం ఆందోళన కార్యక్రమంలో భాగంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో చీమలపాడు షేక్ దాదా భవనంలో ఉపాధి హామీ వాల్ పోస్టర్లు ఆవిష్కరణ జరిగింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పానెం ఆనందరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పేరు మార్చి వి బి జి రామ్ పేరు పెట్టి ఉపాధి హామీ పథకానికి పథకానికి తూట్లు పొడిచిందని దీనివలన కూలీలకు తీవ్రమైన నష్టం జరుగుతుందని అన్నారు. అలాగే ఉపాధి హామీ పథకం కమ్యూనిస్టులు పోరాట ఫలితంగా2005లో వలసలు నివారించేందుకు మన్మోహన్ సింగ్ ప్రభుత్వం కమ్యూనిస్టులు మద్దతుతో ఈ పథకం వచ్చిందని ఈ పథకాన్ని కూటమి ప్రభుత్వం ఉపాధి కూలీలకు దూరం చేస్తుందని దానిలో భాగంగానే పాత చట్టాన్ని రద్దుచేసి కొత్త చట్టాన్ని తీసుకొచ్చిందని దానివల్ల రాష్ట్రాలపై ఆర్థిక భారం పెరిగి చట్టం నిర్వీర్యం అవుతుందని ఆయన అన్నారు.చట్టాన్ని స్కీముగా మార్చిందని దీనివలనఉపాధి కూలీలకు పని గ్యారంటీ పోయి కూలీలకు నష్టం జరుగుతుందనిఅన్నారు.అలాగే కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాన్ని రద్దుచేసి పాత చట్టాన్ని కొనసాగించాలని, ఉపాధి హామీ పథకానికి రెండు లక్షల కోట్లు కేటాయించాలని, 90% కేంద్రమే రాష్ట్రాలకు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు ఆళ్ల అమ్మి రెడ్డి, పంబి వెంకటేశ్వరరావు, ఎస్ ఆనందరావు,సోమ మోహన రావు, లక్ష్మయ్య, కోటిరెడ్డి,పీ లెనిన్,ఎం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సరైన అవగాహనతోనే సైబర్ నేరగాళ్లకు కళ్లెం

### ఆశ, భయం.. సైబర్ నేరగాళ్ల వలకు చిక్కేలా చేస్తాయి

### అనుమానాస్పద లింక్‌ల విషయంలో అప్రమత్తంగా ఉండాలి

### సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సీఐ ఎన్.శ్రీనివాస్



**ఎన్‌టీఆర్ జిల్లా, జనవరి 20, మేజర్ న్యూస్ :** ప్రజల కష్టార్జితాన్ని సైబర్ నేరగాళ్లు గద్దల్లా తన్నుకుపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో సరైన అవగాహన ద్వారానే సైబర్ నేరగాళ్లకు కళ్లెం వేయొచ్చని విజయవాడ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సీఐ ఎన్. శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నగరంలోని ఏపీ స్టేట్ గెస్ట్ హౌజ్ ప్రాంగణంలోని జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యాలయ సమావేశ మందిరంలో సైబర్ నేరాలపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సీఐ ఎన్. శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. ఆధునిక సాంకేతిక ప్రపంచంలో ఒకవైపు మనం ఎన్నో సౌకర్యాలు పొందుతున్నాం.. ఇదే సమయంలో మరోవైపు సాంకేతికత ఆసరాతో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారని పేర్కొన్నారు. సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయడం, సురక్షితంగా ఆన్‌లైన్ సేవలను వినియోగించే విధానాలపై అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఓటీపీలు, బ్యాంక్ వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. అనుమానాస్పద లింక్‌ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆశ, భయం.. ఈ రెండే సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకునేందుకు కారణమవుతాయని.. అందువల్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో సైబర్ నేరాలకు సంబంధించిన ఉదాహరణలు, ఇప్పటికే నమోదైన కేసులతో సహా వివరించి, ఎలా మోసాలు జరుగుతున్నాయో స్పష్టంగా తెలియజేశారు. డిజిటల్ అరెస్టులు, ఏసీబీ అధికారులమంటూ వచ్చే ఫేక్ కాల్స్ తదితరాలపైనా అవగాహన కల్పించారు. ఒకవేళ ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని, గోల్డెన్ అవర్‌లో టోల్ ఫ్రీ నంబర్ (1930) ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. https://www.ntrpolice.in/ వెబ్సైట్ లోని సమాచారాన్ని కూడా పొంది, సరైన అవగాహనతో సైబర్ నేరగాళ్ల నుంచి రక్షణ పొందాలన్నారు. సైబర్ నేరాలపై కేవలం వ్యక్తిగతంగా కాకుండా, బంధువులు, స్నేహితులు, సహోద్యోగులతో కూడా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సీఐ ఎన్. శ్రీనివాస్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బీడబ్ల్యూ దాసన్, డీఐపీఆర్‌వో కేవీ రమణరావు, అడిషనల్ పీఆర్‌వో కె.రవి, ఏవీ సూపర్‌వైజర్ వీవీ ప్రసాద్, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల డీసీవో ఎ.మురళీకృష్ణ, భూ సేకరణ కోర్టు రిజిస్ట్రార్ ఎన్.సూర్యనారాయణ, ఐ అండ్ పీఆర్, డా. ఎన్‌టీఆర్ వైద్య సేవా ట్రస్టు, సాంఘిక సంక్షేమ గురుకులాలు, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## మినుము పంట సాగుపై రైతులకు శిక్షణ

**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం మంగళవారం స్థానిక పమిడిముక్కల మండలం మద్రివాడ గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో మినుము పంటల సాగులో సమగ్ర చీడ పీడల యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కేవికే సమన్వయకర్త డా.డి.సుధారాణి మాట్లాడుతూ పంటల సాగులో అధిక మోతాదులో రసాయనాలు వినియోగిస్తున్నారని, సాగు ఖర్చు అధికంగా మారి నికర ఆదాయం తగ్గుతుందని, రసాయనేతర పద్ధతులు అవలంభించి అవశేష రహిత పంట ఉత్పత్తులు పొందాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత మినుము సాగులో యాజమాన్య పద్ధతులను, వైరస్ తెగుళ్ల సమగ్ర యాజమాన్యం, సమగ్ర చీడ పీడల యాజమాన్యం, కాండం గజ్జి యాజమాన్యం తదితర అంశాలపైన, చేపట్టాల్సిన మెళకువలను గూర్చి రైతులకు వివరించారు. ఈ శిక్షణ అనంతరం మినుము పంటను క్షేత్ర సందర్శన చేసి పొగాకు లద్దె పురుగు నివారణకు నొవాల్యూరాన్ 200 మిల్లీలీటర్లు ఎకరానికి పిచికారి చేసుకోవాలని, బూడిద తెగులు నివారణకు ప్రోపికొనజోల్ 200 మిల్లీలీటర్లు చొప్పున ఎకరానికి పిచికారి చేసుకోవాలని, సూక్ష్మ ధాతు పోషక లోపాల సవరణకు మల్టీ కె ఒక కిలో చొప్పున ఎకరానికి పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కేవికే సస్యరక్షణ శాస్త్రవేత్త డా.రేవతి, గ్రామ వ్యవసాయ సహాయకులు రామకృష్ణా రెడ్డి, కావ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు 'స్ఫూర్తి' స్టడీ మెటీరియల్ పంపిణి



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని హనుమంతపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు 'స్ఫూర్తి' నిచ్చే స్టడీ మెటీరియల్‌ను మంగళవారం పంపిణీ చేశారు. కృష్ణా జిల్లా పరిషత్ కార్యాలయం సౌజన్యంతో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాలలో చదువుతున్న 18 మంది పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను మండల పరిషత్ వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ స్టడీ మెటీరియల్ వినియోగించుకుని విద్యార్థులందరూ ఉత్తీర్ణులు కావాలని, అలాగే పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించడం ద్వారా పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కందుల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు మధుసూదనరావు, రఘు, శ్యామ్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రాజులపాటి శివ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి కళ్యాణం వైభవం

### శ్రీవారి సేవలో తరించిన కేతినీడి తేజోమూర్తి - దేవీ భవానీ దంపతులు

**హనుమాన్ జంక్షన్, జనవరి 20, మేజర్ న్యూస్ :** హనుమాన్ జంక్షన్‌లో ప్రసిద్ధి చెందిన శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం శ్రీదేవిభూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవాన్ని హనుమాన్ జంక్షన్‌కు చెందిన ప్రముఖ బిల్డర్ కేతినీడి తేజోమూర్తి దేవీభవానీ దంపతులు దాతలుగా వ్యవహరించి భక్తి భావంతో ఘనంగా నిర్వహించారు. ప్రతి నెల ఈ దేవాలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని నిత్య నియమంగా నిర్వహిస్తుండగా, ఈ నెల కళ్యాణాన్ని కేతినీడి తేజోమూర్తి దంపతులు దాతలుగా నిర్వహించడం విశేషం. ఈ సందర్భంగా స్వామివారి దేవాలయాన్ని సువాసన పూలతో శోభాయమానంగా అలంకరించి భక్తులను మంత్రముగ్ధులను చేశారు. కళ్యాణ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వితరణను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవాన్ని దేవాలయ ప్రధాన అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు వేదమంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రతి నెల జరిగే ఈ కళ్యాణ మహోత్సవాన్ని నెలకొక భక్తుడు దాతలుగా ముందుకు వచ్చి నిర్వహిస్తున్నారని ఈ సందర్భంగా అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేతినీడి కుటుంబ సభ్యులతో పాటు దేవాలయ ఫౌండర్ ట్రస్టీలు కాకాని అరుణబాబు, తవ్వా పూర్ణ చంద్రరావు, అలాగే పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీనివాసుని కళ్యాణాన్ని తిలకించి ఆధ్యాత్మిక ఆనందంతో తరించారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

### విద్యార్థులు చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలి

### పరీక్షలలో మంచి ప్రతిభ కనబర్చి పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలి : సీఐ వెంకటేశ్వర్లు



**జగ్గయ్యపేట, జనవరి 20 మేజర్ న్యూస్ :** మండలంలో గండ్రాయి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నాడు పదవ తరగతి విద్యార్థులకు 100 రోజుల విద్యా కార్యాచరణ ప్రణాళికలో భాగంగా పాఠశాలకు ప్రత్యేక అధికారిగా నియమితులైన జగ్గయ్యపేట సిఐ వెంకటేశ్వర్లు పాఠశాలను సందర్శించి 100 డేస్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా విద్యార్థులు ఎలా చదువుచున్నది ప్రతిరోజు ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నారా లేదా ప్రతిరోజు సాయంత్రం ప్రత్యేకమైనటువంటి టెస్టులు రాస్తున్నారా లేదా అనే విషయాలను పరిశీలించారు. అనంతరం సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఈ వయసు నుంచే చదువును అలవాటు చేసుకోవాలని ప్రతి ఒక్క విద్యార్థి పదవ తరగతిలో మంచి మార్కులతో పాస్ అయ్యి జీవితంలో బాగా ఎదిగి మీ ఊరికి మీ పాఠశాలకు సమాజానికి సేవ చేయాలని క్రమం తప్పకుండా ప్రతిరోజు పాఠశాలకు హాజరై పాఠాలను శ్రద్ధగా విని అవగాహన చేసుకోవాలని విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి విషయాల పట్ల ఆకర్షితులై సమాజం మంచిపౌరులుగా ఎదగాలని అన్నారు. ఈ సంవత్సరం మార్చిలో జరిగే 10వ తరగతి పరీక్షలలో గండ్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించి ప్రథమునిగా నిలిచినటువంటి విద్యార్థికి 5000 రూపాయలు ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థికి 3000 రూపాయలు తృతీయ స్థానం సాధించిన విద్యార్థికి 2,000 రూపాయలు తన సొంత నగదును, తనచేతులమీదుగా ఆ విద్యార్దులకు బహుకరిస్తానని ఆయన అన్నారు. చిల్లకల్లు ఎస్సై మణికంఠ మాట్లాడుతూ ఈ వయసులో విద్యార్థులు చదువు తప్ప ఏమీ ఆలోచించకూడదని చదువుతోనే మన భవిష్యత్తు బంగారుమయం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గండ్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ రాం బాబు అధ్యక్షత వహించగా పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ సచివాలయ సిబ్బంది ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.



# జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కళ్లజోళ్ల పంపిణీ





**జగ్గయ్యపేట జనవరి 20 మేజర్ న్యూస్ :** మండలంలో షేర్ మహమ్మద్ పేట గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో భాగంగా కంటి పరీక్షలు నిర్వహించగా కళ్లజోళ్ల అవసరం ఉన్న 388 మంది లబ్ధిదారులకు ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, రాజకీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ, ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చైర్మన్, జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్ ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా కళ్లజోళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయంగా తనకు అపారమైన అవకాశం కల్పించిన జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతోనే జయప్రద ఫౌండేషన్ ను ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే అన్న ఎన్టీఆర్ సినీ రంగంలోనే కాకుండా రాజకీయ రంగంలోనూ ప్రజల సంక్షేమం కోసం చేసిన సేవలను గుర్తు చేస్తూ, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అదేవిధంగా విజనరీ లీడర్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను ఈ సందర్భంగా వివరించారు. అనంతరం కంటి ఆరోగ్య ప్రాముఖ్యతపై మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ ఫౌండేషన్ కోఆర్డినేటర్ కట్టా వెంకట నరసింహారావు, ముల్లంగి రామకృష్ణారెడ్డి, బ్రహ్మం, యానాల గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

# జీరో బ్రేక్‌డౌన్స్‌తో నాణ్యమైన సేవలు అందించాలి

**ప్రయాణికుల సంతృప్తే లక్ష్యం**

**కృష్ణాజిల్లా ప్రజా రవాణా అధికారి కె. వెంకటేశ్వర్లు**

**గన్నవరం, జనవరి 20, మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా ప్రజా రవాణా అధికారి కె. వెంకటేశ్వర్లు మంగళవారం గన్నవరం డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా డిపోలో గేట్ మీటింగ్ నిర్వహించి సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. బస్సులను ఎల్లప్పుడూ సక్రమమైన కండిషన్‌లో ఉంచి, ఎటువంటి రిపేర్లు అవసరం లేకుండా పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్న బస్సులనే సర్వీసులకు పంపాలని ఆయన సూచించారు. మార్గమధ్యంలో ఎటువంటి ఫెయిల్యూర్స్ తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ బస్సులను నడపాలని స్పష్టం చేశారు. ప్రయాణికుల సంతృప్తే ప్రధాన లక్ష్యంగా పనిచేసి, వారి నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా నాణ్యమైన సేవలు అందించాలని ఆదేశించారు. అందరూ సమిష్టిగా కృషి చేసినప్పుడే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రతి ఉద్యోగి పూర్తి అంకితభావంతో విధులు



నిర్వహించినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు. డిపోకు ప్రయాణికుల నుంచి మంచి పేరు తీసుకురావాలంటే అందరూ కలిసికట్టుగా కష్టపడి పనిచేయాలని కోరారు. అనంతరం గ్యారేజీలో సర్వీస్ పూర్తయిన బస్సును స్వయంగా రోడ్డు టెస్ట్‌కు తీసుకువెళ్లి, బస్సు పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ శివాజీ, గ్యారేజీ ఇంచార్జ్ వెంకటేశ్వరరావు, ట్రాఫిక్ ఇంచార్జ్ మధు, సూపర్వైజర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రకృతి వనరులను వినియోగించుకోవాలి





**జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా తొలకరి వర్షాలు రాక మునుపే విత్తనపు బంతుల సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమాన్ని పీఎండీఎస్. జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయ అధికారులు, అభ్యుదయ రైతులతో సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి వనరులను వినియోగించుకొని వ్యవసాయం చేస్తే సుస్థిరంగా ఉంటుందని, రైతులు ఆ దిశగా దృష్టి సారించాలన్నారు. ఇందుకోసం వ్యవసాయ అధికారులు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అన్ని విధాల శిక్షణ ఇచ్చి సంపూర్ణ అవగాహన కలిగించాలన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పంట ఉత్పత్తులు నాణ్యతతో పాటు అధిక లాభాలు పొందవచ్చన్నారు. ఇందులో భాగంగా తొలకరి వర్షాలు కురవక మునుపే 32 రకాల పంటల విత్తనాలతో బంతులను ( సీడ్ బాల్స్) తయారు చేసి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఆ సీడ్ బాల్స్ ను వచ్చే ఏప్రిల్ మాసంలో పంట పొలాల్లో వెదజల్లాల్సి ఉంటుందన్నారు. దీంతో ఒకే పొలంలో వివిధ రకాల పంటల ఉత్పత్తులు సంవత్సరం పొడుగునా చేతికి అంది వస్తాయన్నారు. ఇంకా రెండు నెలల సమయం ఉన్నందున ముందు నుంచే ప్రణాళిక సిద్ధం చేసుకుని అందుకు అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో రైతులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఆ రైతుల సహకారం కూడా తీసుకొని వారి ఆధ్వర్యంలోనే వారి అనుభవాలను ఇతర రైతులతో పంచుకుంటూ శిక్షణా తరగతులు సమావేశాలు నిర్వహించాలన్నారు. శిక్షణ పొందని గ్రామాల్లోని రైతులకు పక్కనున్న శిక్షణ పొందిన గ్రామాలకు అనుసంధానం చేయాలన్నారు. ముందు నుంచే రైతులకు అవగాహన కలిగించడం వలన తొలకరి వర్షాల సమయంలో మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. డ్రోన్ ద్వారా సీడ్ బాల్స్ వెదజల్లితే వేగంగాను, సమానంగాను నేలపై పడతాయని ఆ దిశగా డ్రోన్ ను సిద్ధం చేయాలన్నారు. ప్రధానంగా విత్తనపు బంతులు సీడ్ బాల్స్ తయారీ ముమ్మరం చేయాలన్నారు. బాపులపాడు మండలం ఆరుగొలను గ్రామంలో ప్రయోగాత్మకంగా విత్తనపు బంతులను వినియోగించాలని సూచించారు. వచ్చే ఫిబ్రవరి నెల 13వ తేదీన సమావేశం నిర్వహిస్తామన్నారు ఆలోగా ప్రయోగాత్మకంగా చేపట్టిన ప్రదేశంలో మొలకెత్తిన పంట ఉత్పత్తులను గమనించవచ్చన్నారు. గ్రామాల్లో వ్యవసాయ సహాయకులను అప్రమత్తం చేసి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగించాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ వ్యవసాయ అధికారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2026 సంవత్సరపు డైరీని, క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి, ఘంటసాల కెవికె సమన్వయకర్త డాక్టర్ సుధారాణి, వ్యవసాయ సహాయ సంచాలకులు మనిధర్, పార్థసారథి, సునీల్, కవిత, రమాదేవి, స్వర్ణలత, కిరణ్, శైలజ పలువురు అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.



## ఘనంగా వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మంగళవారం మచిలీపట్నం జిల్లా కలెక్టరేట్ పిజిఆర్ఎస్ మీటింగ్ హాల్‌లో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ కె.వి.రామకృష్ణయ్య,జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు, డిఆర్ఓ కే.చంద్రశేఖర రావు, కృష్ణాజిల్లా ఆరోగ్య శాఖ అధికారి యుగంధర్, ఐ సి డి సి పీడీ యం ఎన్ రాణి, కిషోర్,వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఉల్లిపాలెంలో రైతులకు వడ్డీ రాయితీ పంపిణి



**కోడూరు మేజర్ న్యూస్:** ఉల్లిపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సమితి సంఘం పరిధిలో సకాలంలో రుణాలు చెల్లించిన రైతులకు, మంగళవారం వడ్డీ రాయితీ నగదు పంపిణీ చేశారు. 2023 - 24 సం.నికి గాను 466 మంది రైతులకు 3 శాతం రాయితీ కింద రూ. 8,86,048 అందజేసినట్లు సంఘం అధ్యక్షులు బొలిశెట్టి విట్టల్ రావు తెలిపారు. రైతులు ఇలాగే క్రమశిక్షణతో రుణాలు చెల్లించి ప్రభుత్వ ప్రయోజనాలు పొందాలని కోరారు.

## అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం



**మొవ్వ మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన మొవ్వ గ్రామ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి పువ్వాడ సురేష్, మొవ్వ గ్రామ వర్తక సంఘం అధ్యక్షులు నందిపాటి రమేష్, ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు మాటూరి వెంకటేశ్వరరావు, నందిపాటి ఏడుకొండలు నందిపాటి వసంతం, చిట్టూరి నాగభూషణరావు, చిట్టూరి శ్రీనివాసరావు, నందిపాటి బుజ్జి, పల్లపాటి వెంకట సత్యనారాయణ, నందిపాటి ఆంజనేయులు, బెజవాడ సాంబశివరావు, మాటూరి బ్రహ్మయ్య, గార్లపాటి వెంకటరత్నం పలువురు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆపద సమయంలో సీఎం సహాయనిధి అండగా నిలుస్తుంది



**గన్నవరం, జనవరి 20, మేజర్ న్యూస్ :** అనారోగ్య కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఇద్దరు లబ్ధిదారులకు సుమారు రూ.7 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన ఎల్ఓసీ పత్రాలను గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అందజేశారు. ఈ సందర్భంగా బుద్ధవరం గ్రామానికి చెందిన వల్లె రామారావు కి వైద్య చికిత్స నిమిత్తం రూ.3,04,687, అలాగే వీరపనేని గూడెం గ్రామానికి చెందిన పఠాన్ రిహాన్ ఖాన్ కి రూ.4,00,807 చొప్పున ఆర్థిక సహాయం మంజూరైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, ఆపద సమయంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తూ, అవసరమైన వైద్య చికిత్సకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని తెలిపారు.

## 17 నెక్స్ట్-జనరేషన్ ట్రక్కులను విడుదల చేసిన టాటా మోటార్స్



**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశ అతిపెద్ద వాణిజ్య వాహన తయారీదారు, మొబిలిటీ సొల్యూషన్స్ ప్రొవైడర్ టాటా మోటార్స్ 7 నుండి 55 టన్నుల వరకు విస్తరించి ఉన్న 17 ట్రక్కుల తదుపరి తరం పోర్ట్‌ఫోలియోను ప్రారంభించింది. ఇది భద్రత, లాభాలు, పురోగతిలో కొత్త ప్రమాణాలను నెలకొల్పింది. ఈ సమగ్ర ఆవిష్కారం సరికొత్త అజురా సిరీస్, అత్యాధునిక టాటా ట్రక్స్.ఈవీ శ్రేణిని, ఇప్పటికే నిలదొక్కుకున్న ప్రైమా, సిగ్నా, అల్ట్రా ప్లాట్‌ఫామ్‌లకుగణనీయమైన అప్‌గ్రేడ్‌లను అందిస్తుంది. కఠినమైన ప్రపంచ భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించబడిన ఈ ట్రక్కులు, సంపాదన సామర్థ్యాన్ని పెంచి, మొత్తం యాజమాన్య వ్యయాన్ని తగ్గిస్తాయని టాటా మోటార్స్ లిమిటెడ్ ఎండీ, సీఈవో గిరీష్ వాఘ్ పేర్కొన్నారు.

## అవార్డ్ గెలిచిన లాంగిట్యూడ్ 77



**గుంటూరు మేజర్ న్యూస్ :** పెర్నాడ్ రికార్డ్ ఇండియా నుండి ఇండియన్ సింగిల్ మాల్ట్ లాంగిట్యూడ్ 77 హైదరాబాద్‌లో విజయవంతంగా ప్రారంభించింది, తమ సుసంపన్నమైన భారతదేశపు కళా పనితనం, అంతర్జాతీయ నైపుణ్యతతో హైదరాబాద్‌కి చెందిన అర్హత కలిగిన విజ్ఞులను ఆకర్షిస్తోంది. హైదరాబాద్‌లోని ద తాజ్ ఫలక్ నుమా పాలెస్ లో ఒక ప్రత్యేకమైన కార్యక్రమం ద్వారా ఈ విడుదల సంబరం జరిగింది. వాస్తవమైన, సమకాలీన భారతదేశపు విలాస సాటిలేని అనుభవాన్ని అతిథులకు అందిస్తోంది. తమ సాటిలేని నాణ్యత కోసం అంతర్జాతీయంగా గుర్తించబడిన లాంగిట్యూడ్ 77 ప్రతిష్ఠాత్మకమైన ప్రశంశలను అందుకుంది. వీటిలో లండన్ స్పిరిట్స్ పోటీలో బంగారు పతకం, ద స్పిరిట్స్ బిజినెస్, మోండే సెలక్షన్ ద్వారా ద గ్లోబల్ స్పిరిట్స్ మాస్టర్స్, ద ఇంటర్నేషనల్ వైన్ అండ్ స్పిరిట్స్ పోటీలో కాంశ్య పతకం ఉన్నాయి. ఈ అవార్డ్స్ శ్రేష్ఠత పట్ల బ్రాండ్ అచంచలమైన నిబద్ధతను ప్రపంచంలోని ఉత్తమమైన విస్కీలలో దీని పెరుగుతున్న ఖ్యాతిని చూపిస్తున్నాయి.

## బాధితులను పరామర్శించి న్యాయం చేస్తాం : డీఎస్పీ



**తోట్లవల్లూరు మేజర్ న్యూస్ :** కంకిపాడు పోలీస్ స్టేషన్ పరిధి లోని ఉప్పులూరు గ్రామంలో ఈనెల 16వ తేదీన జరిగిన సంఘటన పై తోట్లవల్లూరు హరిజనవాడకు చెందిన బాధితులు ఇచ్చిన రిపోర్ట్‌పై, కంకిపాడు పోలీస్ స్టేషన్‌లో నమోదు కాబడిన కేసులోని బాధితులను గుడివాడ డిఎస్పి వి ధీరజ్ వినీల్ మంగళవారం పరామర్శించారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు డి.ఎస్.పి ధీరజ్ వినీల్ తోట్లవల్లూరు గ్రామం లోని హరిజనవాడకు వచ్చి బాధితులను పరామర్శించి, వారికి తప్పకుండా న్యాయం జరిగేలా చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వం వైపు నుండి రావలసిన సహాయ సహకారాలు త్వరితగతిన వచ్చేలా చేస్తామని, సమాజంలో బాధితులపై పడిన మచ్చను తొలగేలా చేస్తామని, పోలీస్ వైపు నుండి వారికి ఎప్పుడు రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పమిడిముక్కల సీఐ వై.చిట్టిబాబు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఫ్లిప్‌కార్ట్ రిపబ్లిక్ డే సేల్ ప్రారంభం

### ఎదురులేని రిపబ్లిక్ డే డీల్స్‌ను ప్రకటించిన మోటరోలా




**విజయవాడ, జనవరి 20, మేజర్ న్యూస్ :** మొబైల్ ఫోన్ ఆవిష్కరణలలో ప్రపంచ అగ్రగామి, భారతదేశ అగ్రగామి ఏఐ స్మార్ట్ ఫోన్ బ్రాండ్ అయిన మోటరోలా ఈరోజు తన బెస్ట్ సెల్లింగ్ స్మార్ట్‌ఫోన్‌లపై అద్భుతమైన రిపబ్లిక్ డే ఆఫర్లను ప్రకటిం చింది. వినియోగదారులకు సాటిలేని ధరలకు ఫీచర్-ప్యాక్డ్ 5జి పరికరాలకు అప్‌గ్రేడ్ అయ్యే ప్రత్యేక అవకాశాన్ని కల్పిస్తోంది. ఈ ఆఫర్లు ఈరోజు నుండి ప్రారంభమయ్యే ఫ్లిప్‌కార్ట్ రిపబ్లిక్ డే సేల్ సమయంలో అందుబాటులో ఉంటాయి. రిపబ్లిక్ డే సేల్‌లో భాగంగా, మోటరోలా తన పోర్ట్‌ఫోలియోలోని అత్యంత ఫీచర్-రిచ్ స్మార్ట్‌ఫోన్‌లను ఆకర్షణీయ మైన ధరలకు అందించడం ద్వారా వినియోగదారులకు సాటిలేని విలువను అందించడంలో తన నిబద్ధతను బలోపేతం చేస్తోంది. పరిశ్రమ అంతటా స్మార్ట్‌ఫోన్ ధరలు పెరుగుతున్న సమయంలో, మోటరోలా తన శ్రేణిలో తిరుగులేని ధరలతో అత్యుత్తమ విలువను అందిస్తూనే ఉంది, ప్రీమియం డిజైన్, అధునాతన కెమెరా, ఏఐ సామర్థ్యాలు, శక్తివంతమైన పనితీరు, దీర్ఘకాలిక బ్యాటరీలను వినియోగదారులకు మరింత అందుబాటులోకి తెస్తుంది. రిపబ్లిక్ డే సేల్ మోటరోలా ప్రసిద్ధ ఎడ్జ్, మోటో జి-సిరీస్ పోర్ట్‌ఫోలియోలను విస్తరించి, ప్రతి వినియోగదారు విభాగానికి శక్తివంతమైన, అత్యుత్తమ తరగతి స్మార్ట్‌ఫోన్ ఎంపికను నిర్ధారిస్తుంది. ఫ్లాగ్‌షిప్ ఎడ్జ్ సిరీస్‌తో ప్రారంభించి, మోటరోలా ఎడ్జ్ 60 ప్రో ను కేవలం రూ.25,999 ధరకు కొనుగోలు చేయ వచ్చు, ఇది రూ.29,999 నుండి తగ్గించబడింది. దీని ధరలో ఇది ఉత్తమ ఫ్లాగ్‌షిప్ గ్రేడ్ ఫోన్‌గా నిలిచింది. మోటరోలా ఎడ్జ్ 60 ప్రో అధునాతన మోటో ఏఐ సామర్థ్యాలతో నడిచే నిజమైన ఫ్లాగ్‌షిప్-గ్రేడ్ అనుభవాన్ని అందిస్తుంది. ప్రతి సందర్భంలోనూ అద్భుతమైన ఫోటోగ్రఫీ కోసం సెగ్మెంట్‌లోని ఏకైక 50ఎంపి + 50ఎంపి + 50ఎక్స్ ఏఐ - ఆధారిత కెమెరా సిస్టమ్‌ను కలిగి ఉంది. ఇది ప్రపంచంలోనే అత్యంత లీనమయ్యే 1.5కె ట్రూ కలర్ క్వాడ్-కర్వ్ డిస్ప్లేను ప్రదర్శిస్తుంది, లైఫ్-లైక్ విజువల్స్‌ను అందిస్తుంది, డిఎక్స్‌ఓమార్క్ గోల్డ్ లేబుల్-రేటెడ్ 6000ఎంఏహెచ్ బ్యాటరీ తో పాటు 3 రోజుల వరకు దీర్ఘకాలిక ఎండ్యూరెన్స్ ను నిర్ధారిస్తుంది.

ఈ స్మార్ట్‌ఫోన్ 90డబ్ల్యు టర్బోపవర్ ఫాస్ట్ ఛా ర్జింగ్, ఐపి68/ఐపి69 అండర్ వాటర్ ప్రొటెక్షన్‌కు కూడా మద్దతు ఇస్తుంది. ప్రీమియం పాంటోన్‌c క్యూరేటెడ్ డిజైన్‌లో వస్తుంది. ఇది ఈ రిపబ్లిక్ దినోత్సవంలో అందుబాటులో ఉన్న అత్యంత ఆకర్షణీయమైన ఫ్లాగ్‌షిప్ స్మార్ట్ ఫోన్లలోలి ఒకటిగా నిలిచింది. మోటరోలా ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ టి.ఎం. నరసింహన్ మాట్లాడుతూ, "మోటరోలాలో, మా దృష్టి ఎల్ల ప్పుడూ అర్థవంతమైన ఆవిష్కరణలు, అత్యుత్తమ స్మార్ట్‌ఫోన్ అనుభవాలను నిజాయితీ ధరలకు అందించడం పైనే ఉంటుంది. ఈ రిపబ్లిక్ డే సేల్ అన్ని విభాగాలలో ఫీచర్-రిచ్ స్మార్ట్‌ఫోన్‌లను అందించాలనే మా నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. మా ఎడ్జ్, మోటో జి పోర్ట్‌ఫోలియోల ద్వారా, మేం ప్రీమియం డిజైన్, అధునాతన కెమెరా, ఏఐ సామర్థ్యాలు, శక్తివంతమైన పనితీరు, దీర్ఘకాలిక బ్యాటరీలను మరింత అందుబాటులోకి తీసుకురావడం కొనసాగి స్తున్నాం, ప్రతి వినియోగదారునికి ఆకర్షణీయమైన మోటరోలా స్మార్ట్‌ఫోన్ ఉండేలా చూస్తాం" అని అన్నారు.

## మరణించిన కుటుంబానికి 25వేల ఆర్థిక సహాయం



**కొండపల్లి మేజర్ న్యూస్ :** కొండపల్లి మున్సిపాలిటీ కొండపల్లి పుట్లమ్మ గట్టునకు చెందిన దివ్యాంగుడు పందిటి దుర్గారావు నిన్న అనారోగ్య రీత్యా మరణించగా పార్టీ నాయకుల విజ్ఞప్తి మేరకు ఆ పేద కుటుంబానికి స్థానిక పార్టీ నేతలతో పాటు ఎమ్మెల్యే ఇచ్చిన 10000 కలిపి 25 వేల రూపాయలు చెక్కును చైర్మన్ చిట్టిబాబు, వైస్ చైర్మన్,సాంబమూర్తి, అడపా వెంకయ్య, కోనేరు కొండలు,డేవిడ్, స్థానిక నాయకుల చేతుల మీదగా ఇవ్వడం జరిగింది.

## పీవీపీ మాల్ రోడ్డు విస్తరణ చేపట్టిన వీఎంసీ సిబ్బంది







**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** మంగళవారం ఉదయం పీవీపీ మాల్ నుండి జమ్మి చెట్టు సెంటర్ వరకు జరిగే రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించారని విజయవాడ నగరపాలక సంస్థ చీఫ్ సిటీ ప్లానర్ కె. సంజయ్ రత్నకుమార్ అన్నారు. ఈ సందర్భంగా చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్ మాట్లాడుతూ నిత్యం రద్దీగా ఉండే పివిపి మాల్ రోడ్డులో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే చర్యల్లో భాగంగా పీవీపీ మాల్ రోడ్డు నుండి జమ్మి చెట్టు సెంటర్ వరకు 1.3 కి.మీ., ఉన్న 50 అడుగుల రోడ్డు ను మాస్టర్ ప్లాన్ ప్రకారం 60 అడుగుల రోడ్డు గా విస్తీర్ణ పనులను చేపట్టం అని అన్నారు. అందులో భాగం గా సుమారు 50 నిర్మాణాలు ప్రభావితమవుతాయని, ఇందులో 48 ప్రైవేట్ ఆస్తులు, 2 మునిసిపల్ ఆస్తులు ఉన్నాయని అన్నారు. అన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం విస్తరణ చేపడుతున్నారని అన్నారు. ఈ ప్రాజెక్ట్‌ను సజావుగా, పూర్తి చేయడానికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## 3వేల జనాభా ఐదు బెల్ట్ షాప్ లా? సిగ్గుచేటు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** కేవలం మూడు వేల జనాభా ఉన్న అశ్వారావు పాలెం గ్రామంలో ఐదు అనధికార మద్యం బెల్ట్ షాపులు ఉండటం సిగ్గుచేటని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సేలం నారాయణరావు, సిపిఎం అవనిగడ్డ శాఖ కార్యదర్శి జి శ్రీనివాసరావు లు మంగళవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. గ్రామానికి అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వాలు, వాటిని మరిచి గ్రామంలో ఐదు బెల్ట్ షాపులకు అనుమతులు ఇచ్చి ప్రజలను ముఖ్యంగా యువతను మద్యానికి బానిసలుగా తయారయ్యే కేంద్రాలుగా చేయటం చాలా దుర్మార్గమని. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి మహిళలకు, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా గ్రామంలో యువత మద్యానికి బానిసలు కాకుండా చర్యలు తీసుకోవాలని వారు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు.

## చెరువు అభివృద్ధికి శ్రీకారం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** కొత్తపేట రోడ్డులో ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కార్యాలయం దాటిన తర్వాత ఉన్న చెరువు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. మంగళవారం స్థానిక పంచాయతీ అధికారులు, అవనిగడ్డ స్వచ్ఛ సేవకులు చెరువు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఎన్నో సంవత్సరాలుగా చెరువు చుట్టూ పిచ్చ మొక్కలు పెరిగి నిరుపయోగంగా మారిన చెరువును అందంగా మారుస్తూ చుట్టూ వాకర్స్ ట్రాక్ నిర్మాణం చేసే విధంగా ముందుకు సాగుతామని పంచాయతీ అధికారులు స్వచ్ఛ సేవకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ పంచాయతీఈవో తోట శ్రీనివాసరావు, అద్దంకి సుబ్బారావు, యాసం చిట్టిబాబు, మత్తి శ్రీనివాసరావు, యలవర్తి రాజనాగ మునీశ్వరరావు, (చిన్నా), యలవర్తి ఆది, కూనపురెడ్డి చంద్రశేఖర రావు, యలవర్తి ఆంజనేయులు, దామెర్ల సతీష్, మండలి శివ, మత్తి మురళి, బచ్చు రఘునాథ్, మైల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటి నుంచి తడి.. పొడి చెత్త సేకరణ జరగాలి



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం గ్రామాల్లో ఖచ్చితంగా ఇంటింటి నుంచీ తడి.. పొడి చెత్త సేకరణ జరగాలని మచిలీపట్నం డివిజనల్ పంచాయతీ అధికారి ఎండి.రజావుల్లా తెలిపారు. చల్లపల్లి సంపద తయారీకేంద్రం(ఎల్లిసి ట్రైనింగ్ సెంటర్) వద్ద మంగళవారం డిప్యూటీ ఎంపీడీవోలు, కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఎల్పీవో మాట్లాడుతూ, ఇంటిం టి నుంచీ తడి...పొడి చెత్త సేకరణలో ప్రజాభిప్రాయ సేకరణలో వెనుకబడిన గ్రామపంచాయతీలు తమ పనితీరును మెరుగుపరచుకోవాలన్నారు. చెత్త సేకరణలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్న చల్లపల్లిలో చెత సేకరణ విధానాలు పరిశీలించటం, వర్మి కంపోస్ట్ తయారీలను చూడటం, ప్రత్యేక శిక్షకులతో సూచనలు అందించేందుకు శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రామాల్లో తడి పొడి చెత్త సేకరణ జరగాలనీ, వర్మికంపోస్ట్ తయారీ, పొడిచెత్త విక్రయం చేపట్టాలని సూచించారు. పొడిచెత్త సేకరణకు స్వచ్ఛ రథాలు నడుపుతున్నట్లు తెలిపారు. చల్లపల్లి ఎంపీడీవో ఆనందకుమారి, డిప్యూటీ ఎండీపీవో పద్మావతి, కార్యదర్శి పివి.మాధవేంద్రరావులతోపాటు మచిలీపట్నం, గుడివాడ డివిజన్లలోని 12 మండలా ల డిప్యూటీ ఎంపీడీవోలు, 23 మంది కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

**శిక్షణా కార్యక్రమాలు తేదీల మార్పు**

శిక్షణా కార్యక్రమాలు నిర్వహణకు రిసోర్స్ పర్సన్లు రాలేదు. షెడ్యూల్ ప్రకారం శిక్షణా తరగతులు 23వ తేదీ నుంచీ నిర్వహించాల్సి ఉండగా, పొరపాటున మంగళవారం నుంచీ నిర్వహించేలా డీపీవో కార్యాలయ అధికారులు ఉత్తర్వులు ఇవ్వటంతో అధికారులు, కార్యదర్శులు చల్లపల్లి వచ్చారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో శిక్షణా కార్యక్రమాలను వాయిదా వేశారు. అప్పటికే మధ్యాహ్నం కావటంతో భోజనాలు చేసి అధికారులంతా వెళ్లిపోయారు. మళ్లీ 23వ తేదీ నుంచి మూడు రోజులపాటు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.




## పినపాకలో పొలంబడి కార్యక్రమం

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జి కొండూరు మండలం పినపాక గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి కే సిహెచ్ సూరిబాబు రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. మొక్కజొన్న పంట లో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలు గురించి ఆయన వివరించడం జరిగింది. మొక్కజొన్న లో కత్తెర పురుగు ఉధ్ధృతి గమనించడం జరిగింది.దీనిని నివారించడానికి ప్రోక్లైన్ మందును ఎకరాకు 80 గ్రాములు 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవలెనన్నారు. 5 మిల్లీలీటర్లు వేప నూనెని, లీటర్ నీటికి కలిపిపిచికారిచేసుకోవలెనన్నారు. ఈ రబీ సీజన్లో పంటవేసిన మొక్కజొన్న , వరిరైతులందరూ పంట నమోదు తప్పనిసరిగా మీ గ్రామ రైతు సేవ కేంద్రంలో పనిచేస్తున్న వ్యవసాయ శాఖ సచివాలయం అధికారులను సంప్రదించి పంట నమోదు పూర్తి చేసుకోవాలన్నారు. అలాగే పంట మార్పిడి చేయాలన్నారు. నీటి వనరులను సద్విని తీసుకొని అభివృద్ధి సాధించాలని వ్యవసాయ అధికారి సూరిబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## టేకు రథం దాత అట్లూరిని సత్కరించిన ఎమ్మెల్యే



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానానికి రూ.కోటికి పైగా వ్యయంతో నూతన టేకు రథం తయారు చేయిస్తున్న ప్రముఖ సినీ నిర్మాత అట్లూరి నారాయణరావును ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఘనంగా సత్కరించారు. మంగళవారం సాయంత్రం అవనిగడ్డలో ఎమ్మెల్యే బుద్ధప్రసాదును నారాయణరావు మర్యాదపూర్వకంగా కలిసి టేకు రథం బహుకరణ కార్యక్రమానికి ఆహ్వానించారు. మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానానికి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈనెల 24వ తేదీ తాను తయారు చేయించిన నూతన టేకు రథాన్ని అప్పగించనున్నట్లు నారాయణరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేయవలసిందిగా ఎమ్మెల్యేను నారాయణరావు ఆహ్వానించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సుప్రసిద్ధ దేవస్థానంగా ప్రఖ్యాతి పొందుతున్న మోపిదేవి పుణ్యక్షేత్రానికి రూ.కోటికి పైగా వ్యయంతో నూతన టేకు రథాన్ని బహుకరించడం ప్రశంసనీయం అని ఎమ్మెల్యే అన్నారు. మోపిదేవి దేవస్థానం అభివృద్ధిలో దాతల పాత్ర కీలకంగా నిలుస్తోందన్నారు. ఈ సందర్భంగా నారాయణరావును ఎమ్మెల్యే ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి చిరువోలు బుచ్చిరాజు పాల్గొన్నారు.

# నాగాయలంకలో వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమం

### ఆత్మాభిమానానికి త్యాగానికి ప్రతీక వాసవి మాత ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్





**నాగాయలంక జనవరి 20 మేజర్ న్యూస్ :** నాగాయలంక గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం సన్నిధిలో ఈరోజు వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా అమ్మవారికి ముత్తైదువులు జల బిందెలతో పవిత్ర కృష్ణానది జలముతో అభిషేక కార్యక్రమాలు నిర్వహించినారు. ఆత్మార్పణతో ఆత్మాభిమానానికి త్యాగానికి ప్రతికగా వాసవి మాత నిలిచారని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు మంగళవారం నాగాయలంకలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి సమన్విత పార్వతి సమేత నగరేశ్వర స్వామి వారి దేవాలయంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆత్మార్పణ మహోత్సవం ఘనంగా నిర్వహించినారు ఈ సందర్భంగా అమ్మవారిని ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించుకున్నారు ఈ సందర్భంగా ఆయనకు ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ కొల్లిపర సుబ్బారావు వేద ఆశీర్వచనం అందించగా కమిటీ పెద్దలు ఘనంగా సత్కరించినారు ఎమ్మెల్యే చేతుల మీదగా ఆలయ ప్రాంగణంలో ఉసిరి మొక్కలు నాటినారు. ఈ సందర్భంగా వాసవి అమ్మవారి ఉత్సవమూర్తి ఊరేగింపును ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు శేష వాహనంపై అమ్మవారి గ్రామోత్సవములో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా.సాంబశివరావు, పెద్దలు చిట్టా శివ నాగేశ్వరరావు చెత్త వీర అన్నపూర్ణయ్య చిట్టా శ్రీనివాసరావు వాసవి సేవాదళ్ సభ్యులు వంకాయల రాజేష్(ఆది) చిట్టా శేఖర్ బాబు భోగాధి రాధ మండల గ్రామ ఆర్యవైశ్య పెద్దలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేసినారు.

## మచిలీపట్నం పోలీస్ స్టేషన్ ఎస్ఐగా పి.జగదీష్




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా పి.జగదీష్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

## బాల్యవివాహాలను నిర్మూలిద్దాం..



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జి కొండూరు మండలంలోని చెవుటూరు గ్రామంలో బాల్య వివాహ రహిత ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలోభాగంగా బాల్య వివాహ నిర్మలనకు 100 రోజుల జాతీయ ప్రచారా కార్యక్రమన్ని చెవుటూరు గ్రామంలోని బిసి ఏరియాలో ఐసిడిఎస్ అధికారులు మంగళవారం నిర్వహించారు. స్థానిక ప్రజలకు బాల్యవివాహాల నిర్మూలలపై అవగాహన కల్పించారు.అనంతరం గ్రామస్తులతో కలసి ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఐసిడిఎస్ సూపర్వైజర్ అన్నామని, టీచర్లు వి. కృపవారం, ఎన్ వరలక్ష్మి, ఎస్. మరియమ్మ. డి మల్లేశ్వరమ్మా పాల్గొన్నారు.

## శ్రీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** శ్రీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని చల్లపల్లిలో ఆర్యవైశ్యులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీఆర్యవైశ్య యువజన సంఘం వారి ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహాన్ని పల్లకిలో ఊరేగింపుగా పొట్టి శ్రీరాములు వీధి నుంచీ చల్లపల్లి పురవీధుల మీదుగా కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం వరకు తీసుకువెళ్లారు. వాసవీమహిళా భక్తబృందం అలంకరించిన పళ్లాలలో 108 దీపాలతో మేళతాళాలతో ఊరేగింపు చేశారు. అర్చకులు మామిళ్లపల్లి శివరామకృష్ణ హోమ 0, పూజా కార్యక్రమాలు నిర్వహించగా, గీతా భక్త బృందం వారిచే అమ్మవారి సహస్రనామ స్తోత్రం, వాసవీ ఛాలీసా, వాసవి గోవింద నామ పారాయణ జరిగింది. మహిళా భక్తులు పెద్దఎత్తన ఈ కార్యక్రమ ంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు శివరామకృష్ణవరప్రసాద్, గోళ్ల రాంప్రసాద్, నరసిం హారావు, వరదా హరిగోపాల్, రాజశేఖర్, యువజన సంఘం అధ్యక్షులు తమ్మన సాంబ, నాగేంద్ర ప్రకాష్, దుర్గాప్రసాద్, సురేష్, మహిళామండలి ప్రతినిధులు విస్సంశెట్టి దుర్గ, హారిక, రేవతి, ప్రసీద, జ్యోతి తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించి కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మొక్కజొన్న రైతులు ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలి




**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** మొక్కజొన్న సాగుచేసిన ప్రతిరైతు తప్పనిసరిగా సంబంధిత విఏఏను సంప్రదించి ఈ- క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని చల్లపల్లి మండల వ్యవసాయశాఖ అధికారి కె.మురళీకృష్ణ తెలిపారు. పురిటిగడ్డ, నడకుదురు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి మొక్కజొన్న పంటలో సస్యరక్షణ చర్యలు, ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహనకల్పించారు. ప్రస్తుతం మొక్కజొన్నలో గులాబిరంగు కాండం తొలుచు పురుగు ఉధృతి గమనిస్తున్నట్లు చెప్పారు. ఇమామెక్టిన్ బెంజాయేట్ 90 గ్రాములు లేదా క్లోరాంధ్రనిల్ల్ 60 మిల్లీలీటర్లు, ఉధృతి ఎక్కువగా ఉంటే కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు మూడు కిలోలు ఎకరాకు చొప్పున సుడులలో వేయటం ద్వారా పురుగును అదుపులో ఉండవచ్చున్నారు. ఎరువులను అవసరం మేరకు మాత్రమే వాడుకోవటం ద్వారా ఖర్చులు తగ్గించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పురిటిగడ్డ సొసైటీ సీఈవో కంఠంనేని నాగేశ్వరరావు, వీఏఏలు నాగబాబు, రేవతి, రైతులు పాల్గొన్నారు.

# వాసవి మాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

## గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు



**గన్నవరం, జనవరి 20, మేజర్ న్యూస్ :** వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం ను రాష్ట్ర ప్రభుత్వ పండుగగా అధికారికంగా నిర్వహిస్తుందని గన్నవరం ఎమ్మెల్యే, ఏపీ ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు వెల్లడించారు. విజయవాడ రూరల్ ప్రసాదంపాడు శ్రీ వాసవి సేవా సంఘం ఆధ్వర్యంలో, అలాగే గన్నవరం వాసవి నగర్‌లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి విశ్వరూప (ఆత్మాహుతి) మహోత్సవ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యార్లగడ్డ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వానికి, గన్నవరం నియోజకవర్గ ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆయన ప్రార్థించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని శాస్త్రోక్తంగా కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, ఆర్య వైశ్యుల ఆరాధ్య దైవం, అహింసా మూర్తి అయిన వాసవీ మాత నిర్యాణం చెందిన పవిత్ర దినాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక పండుగగా నిర్వహిస్తుందని తెలిపారు. ఇది ఆర్యవైశ్య సామాజిక వర్గానికి ప్రభుత్వం ఇచ్చే గొప్ప గౌరవమని ఆయన పేర్కొన్నారు. లోక కళ్యాణం కోసం అమ్మవారు చూపిన మార్గం సమాజానికి ఆదర్శనీయమని అన్నారు. అమ్మవారి కృపా కటాక్షాలు రాష్ట్ర ప్రభుత్వంపై, గన్నవరం నియోజకవర్గ ప్రజలపై నిరంతరం ఉండాలని, ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య ప్రముఖులు, సేవా సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును ఘనంగా సత్కరించారు. గన్నవరం ఏఎంసి చైర్మన్ గూడవల్లి నరసింహారావు, గన్నవరం మండల తహశీల్దార్ కె. శివయ్య, గన్నవరం మండల టిడిపి అధ్యక్షులు గూడపాటి తులసిమోహన్, గన్నవరం ఉప సర్పంచ్ పాలడుగు నాని, గన్నవరం టౌన్ టిడిపి అధ్యక్షులు జాస్తి శ్రీధర్, టీడీపీ నాయకులు బొప్పన హరికృష్ణ, గుజ్జర్లపూడి బాబురావు, సర్నాల బాలాజీ, కోనేరు పెద్దబాబు, బండి వెంకట్రావు (నాని), నబిగాని కొండయ్య, అద్దేపల్లి సాంబ శివరావు, కొల్లా ఆనంద్, ముక్కపాటి చైతన్య, కాసూరు యుగంధర్, అడుసుమిల్లి నవీన్, కోనేరు వెంకట నారాయణ, దాసరి శ్వేత, లావణ్య, నూతి సుభాషిణి, తుపాకుల శివలీల, మేకల స్వాతి, కొంగన రవి, పదమట రంగారావు, నిమ్మకూరి మధు, ఆళ్ల దమయంతి, దేవినేని సోలోచన రాణి, మొర్ల నాగ బాబు, మేడేపల్లి సురేష్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పట్టు వస్త్రాలు







**వత్సవాయి జనవరి 20 మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆర్యవైశ్యుల విజ్ఞప్తి మేరకు రాష్ట్ర పండుగ ప్రకటించిన అనంతరం మంగళవారం అమ్మవారి ఆత్మర్పణ దినోత్సవం సందర్భంగా స్థానిక జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) వత్సవాయి గ్రామంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారిని దర్శించుకునేందుకొని పట్టు వస్త్రాలు అధికారికంగా అందజేయడం జరిగింది.అనంతరం వేద పండితులు రాజగోపాల్ తాతయ్యకి ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఆర్య సంఘ అధ్యక్షులు దేవాలయ వ్యవస్థాపకులు బొగ్గవరపు వెంకట రాజారావు, దేవాలయ కమిటీ చైర్మన్ కొత్త వెంకట నరసింహారావు, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పోలా పూర్ణ చంద్రరావు, ఆర్యవైశ్య మహాసభ ప్రత్యేక ఆహ్వానితులు తెలుగుదేశం నాయకులు చన్నా బాలకృష్ణ, వత్సవాయి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, తెలుగుదేశం నాయకులు పెంటల శ్రీనివాసరావు, పెద్ది రామారావు, చిట్టూరి రమేష్ పెనుగంచిప్రోలు ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు దివ్వెల కొండలు, కేశా అవినాష్ కేశా కార్తీక్, బివిఎస్ఎస్ చక్రవర్తి,కొత్త గోవిందరావు గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి హ్యాకథాన్‌లో ఎస్ఆర్ జిఇసికి ద్వితీయ స్థానం





**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ జనవరి 20 :** జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్ " ఇగ్నిషన్ 2క26" పేరిట ఆటో డెస్క్ అమెరికా ఆధారిత కంపెనీ, అనీల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, విశాఖపట్నం సంయుక్తంగా ఈ నెల 8వ, 9వ తారీఖులలో 36 గంటల నిర్విరామ ఆన్ లైన్, హాకథాన్– ఆటో డెస్క్ డిజైన్ ఛాలెంజ్ పోటీలో స్థానిక శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ కు చెందిన ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు దేవరాపల్లి ప్రవీణ్ కుమార్, బోయిన కార్తీక్, మలిశెట్టి అభినవ్ లు రూపకల్పన చేసిన "అల్ట్రా కాంపాక్ట్ కొలాప్సిబుల్ మార్కెట్ ట్రోలీ" యంత్ర పరికర నమూనాకు ద్వితీయ బహుమతి వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ తెలిపారు. ఈ ఆన్ లైన్ హాకథాన్ లో ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాక ఇతర రాష్ట్రాల నుండి 92 బృందాలు పాల్గొనగా, ఆటో డెస్క్ ఫ్యూజన్ సాఫ్ట్ వేర్ ను ఉపయోగించి పరిశ్రమకు సంబంధించిన డిజైన్ సవాళ్ళన్ను ఎదుర్కొనే క్రమములో ప్రదర్శించిన అసాధారణ ప్రతిభ, సమిష్టి కృషి, సమస్య పరిష్కార నైపుణ్యాలు, సామర్థ్యాలు ప్రాతిపదికగా ఈ అవార్డ్ ను అందించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ తెలియజేశారు. ప్రకటించిన మొదటి పది స్థానాలలో 7వ, 8వ, 10వ స్థానాలలో సహితం శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ (తమ కళాశాల) నిలవడం విశేషమన్నారు. ఈ విజయంలో సమయానుకూలంగా ఫ్యాకల్టీ బృంద సభ్యులు డా. టి.నాగ రాజు, డా. ఎల్.రమేష్, ఎస్.బి.కె.రెడ్డి, ఏ.రాజేష్, కె.రమాకాంత్ తగిన సలహాలు, సూచనలు చేసి సమన్వయకర్తలుగా విద్యార్థులను తీర్చిదిద్దినట్లు ఆయన అన్నారు. ఈ సందర్భముగా విజేతలైన విద్యార్థులను, అధ్యాపకులను కళాశాల డైరెక్టర్ డా. పి.సిద్ధయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్, యాజమాన్య సలహాదారు డా.రవీంద్ర బాబు,వైస్ ప్రిన్సిపాల్స్ డా.పి కోదండ రామారావు, డాక్టర్ ఎం.ఆర్.సి.హెచ్.శాస్త్రి, పి.జి.సి.ఆర్.డి. డైరెక్టర్ డా.జి.వి.ఎస్.ఎన్.ఆర్.వి.ప్రసాద్, ఏ.ఎస్&ఏ డైరెక్టర్ డా. ఎం.కామరాజు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా. డా.కె.సి.హెచ్.కిశోర్ కుమార్, వివిధ విభాగాధిపతులు, మెంటర్స్, అధ్యాపకులు తదితరులు శుభాకాంక్షలు తెలియజేస్తూ అభినందించారు.

## సీపీ కార్యాలయంలో... శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం





**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** నగర పోలీస్ కమీషనర్ ఎస్. వి. రాజ శేఖరబాబు వారి కార్యాలయంలో మంగళవారం శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి చిత్రపటానికి పూలమాలవేసి వారు చేసిన సేవలను స్మరించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో డి.సి.పి. కె.జి. వి.సరిత, సి. పి. ఓ అధికారులు, పోలీస్ అధికారులు, సి.పి.ఓ. సిబ్బంది తదితరులు పాల్గొని నివాళులర్పించారు. సమాజ శ్రేయస్సు కోసం, ధర్మ రక్షణ కోసం అహింసా మార్గంలో అగ్ని ప్రవేశం చేసిన త్యాగమూర్తి శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారని, "అహింసా పరమో ధర్మః" అనే నినాదంతో సమాజ హితం కోసం ప్రాణత్యాగం చేసిన ఆమె మార్గం నేటి మహిళా సాధికారతకు, సామాజిక బాధ్యతకు దిక్సూచి అని, ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.

## తోట్లవల్లూరు ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన కిషోర్



**తోట్లవల్లూరు మేజర్ న్యూస్ :** తోట్లవల్లూరు పోలీస్ స్టేషన్ నూతన ఎస్.ఐగా పి.కిషోర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సిహెచ్.అవినాష్ మచిలీపట్నం సిసిఎస్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో గన్నవరంలో పని చేస్తున్న కిషోర్ బదిలీపై వచ్చి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సకాలంలో పోలీస్ సేవలు అందేలా కృషి చేస్తానన్నారు. అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన శ్రీధర్ బాబు



**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** పెదపారుపూడి పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా రెడ్డిపల్లి శ్రీధర్ బాబు బాధ్యతలు చేపట్టారు. జిల్లాలోని ఆత్కూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా శిక్షణ పొందిన ఆయన నూతన ఎస్సైగా పెదపారుపూడి పోలీస్ స్టేషన్‌కు నియమింపబడ్డారు. బాధ్యతలు చేపట్టిన ఎస్సై శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని పేర్కొన్నారు. సమస్యలపై స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజలు కూడా తమ సిబ్బందికి సహకారం అందించడం ద్వారా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉండేలా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు **ఎస్.వెంకట్,** ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999